సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: మరమ్మతుల కారణంగా మండలంలోని నూతన్‌కల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా నూతన్‌కల్, మైసిరెడ్డిపల్లి, లింగాపూర్, కోనాయిపల్లి గ్రామాల్లో.. అదే విధంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో కండ్లకోయ, సుతారిగూడ గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు.

కీసరగుట్ట జాతర దుకాణ సముదాయాల తైబజార్ వేలం పాట

కీసర: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్టలో దుకాణ సముదాయాల నుంచి తైబజార్ రుసుము వసూలు చేయడానికి మంగళవారం కీసరగుట్టలో నిర్వహించిన తైబజార్ వేలంపాటలో కీసర గ్రామానికి చెందిన చిక్కుడు రమేష్ రూ.2.83 లక్షలకు తైబజార్ వేలం పాటను దక్కించుకున్నట్లు డీపీఓ రమణమూర్తి తెలిపారు. కీసరగుట్ట జాతరలో ఏర్పాటు చేసే చిరు దుకాణ సముదాయాల నుంచి చిక్కుడు రమేష్ తైబజార్ రుసుము వసూలు చేసుకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, ఎంపీఓ మంగతాయారు, గ్రామ సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ టి.నారాయణ, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల మీదుగా పటాన్‌చెరుకు బస్సు సర్వీసులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ డిపో నుంచి పటాన్ చెరువు వెళ్లే బస్సు సర్వీసులను ఇక నుంచి పలు గ్రామాల మీదుగా నడపనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. మేడ్చల్ డిపో నుంచి ప్రారంభమై మేడ్చల్ చెక్‌పోస్ట్, సుతారిగూడ, అయోధ్య, జ్ఞానాపూర్, గండిమైసమ్మ, బాచుపల్లి, మియాపూర్ చౌరస్తా, లింగంపల్లి మీదుగా పటాన్‌చెరువుకు ప్రతీ రోజు 3 బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఎదులాబాద్ కార్యదర్శి బోగారానికి బదిలీ

ఘట్‌కేసర్: ఎదులాబాద్ పంచాతీయ కార్యదర్శి ఉష బదిలీపై బోగారం గ్రామానికి వెళ్లారు. గ్రామంలో సర్పంచ్, కార్యదర్శి కలిసి నకిలీ రశీదు పుస్తకాలతో లక్షలాది రూపాయలు దండుకున్నారని పాలకవర్గ సభ్యులు ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అవనీతి ఆరోపణలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆమె బదిలీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామసభలో కార్యదర్శిపై ఓ మహిళ దాడి చేసిన ఘటనలో పీఎస్‌లో కేసు కూడా నమోదైంది. విచారణ జరుగుతున్న సమయంలో కార్యదర్శి ఉండకూడదని బదిలీ చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా...

ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పర్యవేక్షిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, అంజిరెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డిలు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారి చేతుల మీదుగా ఉచిత మందులు పంపిణీ చేశారు. మండల పశు వైద్యాధికారి పద్మిని, వార్డు సభ్యుడు పవన్‌నాయక్, కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

మేడ్చల్‌రూరల్: బ్లాక్‌డే సందర్భంగా పుల్వామా బాంబు దాడిలో వీర మరణం పొందిన 40 మంది జవాన్ల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మేడ్చల్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణంలోని యువకులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి

ఘట్‌కేసర్: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. బీహార్‌లోని అరారీయా జిల్లా కేంద్రానికి చెందిన సులేమాన్(30) ఘట్‌కేసర్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఓ బాలిక(11) చికెన్ కొనేందుకు రాగా బిల్డింగ్ పై ఉన్న కోళ్లను ఇద్దరం వెళ్లి తీసుకొద్దామని చెప్పి లాక్కెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కేకలు వేస్తూ భయంగా బయటకు పరుగెత్తింది. స్థానికులు గమనించి చికెన్ సెంటర్‌కు వెళ్లి సులేమాన్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై నిర్భయ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఫిర్యాదులు ఫుల్ పరిష్కారాలు నిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం (ఫైల్)

- ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో 10 నెలలుగా 948 పెండింగ్ దరఖాస్తులు
- పనితీరుకు ప్రజా ఫిర్యాదుల విభాగమే ప్రామాణికం
- పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్‌కు ప్రజల మొర
- ఇన్‌చార్జిల నుంచి రెగ్యులర్ పాలన వచ్చినా.. తీరు మారేనా..?

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజావాణి ఫిర్యాదులకు దిక్కులేకుండా పోయింది. మహానగరం హైదరాబాద్ జిల్లా తర్వాత అత్యధిక జనాభా కలిగినా అతిపెద్ద జిల్లాగా మేడ్చల్–మల్కాజిగిరికి పేరు ఉంది. రెవెన్యూ శాఖ పరంగా ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివాదాలు, కోర్టు కేసులు కూడా అధికంగానే ఉన్నాయి. మరోపక్క హైదరాబాద్ మహా నగరానికి సమాంతరంగా శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. పైగా తెలంగాణలో ఎక్కడా లేని విధంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 4 నగర పాలక సంస్థలు, 9 మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని దాదాపు 12 మున్సిపల్ సర్కిళ్లు, 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్న జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా తెలంగాణలో వర్ధిల్లుతోంది.

ప్రజావాణి అంటే...

కలెక్టరేట్‌లో ప్రజావాణి అంటే జిల్లా కలెక్టర్ సహా అదనపు కలెక్టర్లు, డీఆర్వో, ఆర్డీవోలతో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యలను స్వీకరించే ఫిర్యాదులను కలెక్టర్ అక్కడిక్కడే పరిష్కరిస్తారు. అవసరమైతే.. అప్పుడే అక్కడున్న సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది.

షరా మామూలే అన్నట్లుగా...

కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం అధికారుల పని తీరుకు అద్దం పడుతోంది. ప్రజావాణి ప్రారంభం కాగానే అరగంట పాత(పెండింగ్) దరఖాస్తులపై సమీక్ష ఉంటుంది. పాత వాటిలో పరిష్కారమైనవి ఎన్ని? కాని వాటికి గల కారణాలేంటనే దానిపై అక్కడే చర్చ జరుగుతుంది. కొంత కాలంగా ఆ విధానం జిల్లాలో నిలిచిపోయింది. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ కార్యాలయాల్లో న్యాయం జరగక ప్రజావాణికి వచ్చే బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి కలెక్టర్ హాజరు కాకపోతే.. పట్టించుకోవడం అనేది షరా మామూలే అన్నట్లుగా ఉంటోంది. ప్రజల గోడు వినేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రజావాణికి నెలల తరబడి కలెక్టర్లు హాజరు కాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అదే పరిస్థితి మేడ్చల్ ప్రజావాణిలో కనిపిస్తోంది. దీంతో ప్రజావాణి వినతులకు మోక్షం లభించకపోగా.. వాటి పరిష్కారం ఏ స్థితిలో ఉందన్న విషయం కూడా ఫిర్యాదుదారులకు తెలియక ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సందర్భాలు అనేకంగా ఉన్నాయి.

పెండింగ్ దరఖాస్తులెన్నో...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దాదాపు రెండేళ్లు ఇన్‌చార్జి కలెక్టర్ల పాలనలో కొనసాగడం వల్ల ప్రజావాణి ఫిర్యాదులకు మోక్షం లభించడం లేదన్న అపవాదును ఎదుర్కొంటోంది. 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 నెలల కాలంలో ప్రజావాణిలో 2313 ఫిర్యాదులు రాగా ఇప్పటి వరకు 1365 మాత్రమే పరిష్కారానికి నోచుకొనగా, 948 ఫిర్యాదులు ఇంకా పెండింగ్‌లోనే మగ్గుతున్నాయి. ధరణి పోర్టల్‌కు సంబంధించిన దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా రావడంతో సులభంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ధరణికి సంబంధించిన 2342 దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకొనకుండా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. పెండేన్సీలో ఉన్న ఫిర్యాదుల్లో రెవెన్యూ, ధరణికి అక్రమ కట్టడాలకు సంబంధించిన దరఖాస్తులు 60 శాతం ఉండగా, మిగతా శాఖలకు చెందినవి 40 శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్ని సార్లు.. విన్నవించినా..

కలెక్టరేట్ ప్రజావాణిలో వ్యయ, దూర భారానికి ఓర్చి తమ సమస్యలపై దరఖాస్తు పెట్టుకున్నా.. పరిష్కారానికి నోచుకోవడం లేదని బాధిత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రతీ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు తమ సమస్యలను మొర పెట్టుకున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని వారు ఆరోపిస్తున్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



ఘట్‌కేసర్: వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(బీపీడీపీ) సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రణాళికల ప్రకారం అధికారులు ముందుండి నడిపించాలని, ప్రజావసరాల మేరకు ప్రణాళికలు రచించి మెరుగైన సేవలందించాలన్నారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు లేక కేంద్రాలను తెరవడం లేదని తనిఖీల్లో తేలిందని, అలాంటప్పుడు పిల్లల ఆహారం ఏమవుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటనల మేరకు బస్తీ దవాఖానాలో 58 రకాల పరీక్షలు, 155 రకాల మందులు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు లేక పేద విద్యార్థులు చదువు వెనకబడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీఓ అరుణారెడ్డి, ఎంపీఓ నందికిశోర్, నాయబ్ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీలు శోభారెడ్డి, రవి, భాస్కర్‌రెడ్డి, రామారావు ముదిరాజ్, సర్పంచులు కావేరి, జలజ, శివశంకర్, యాదగిరి, మంగమ్మ, వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సురేశ్, కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో సమస్యలు పరిష్కరించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఎస్‌ఎంఈ అధికారులు

మేడ్చల్‌రూరల్: వినూత్న, సృజనాత్మకతతో సమస్యకు పరిష్కారం చూపించేలా విద్యార్థులు వాణిజ్యంను అవకాశంగా మలచుకోవాలని ఎంఎస్‌ఎంఈ ఉన్నతాధికారులు రాకేశ్‌కుమార్, రామకృష్ణన్, కేసీ చౌదరి, సుభాష్ చంద్‌లు సూచించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వాణిజ్య అంకుర కేంద్రం ఏర్పాటు సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఐడియా హ్యాకథాన్–2022 పోటీల్లో 56 ఆలోచనలతో రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల కొరకు రూ.4.12 కోట్ల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వివరించారు. ఇటీవల విడుదల చేసిన అంతర్జాతీయ ఇన్నోవేషన్ సూచీలో దేశం 40వ స్థానానికి ఎగబాకిందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో వాణిజ్య అంకుర కేంద్రాన్ని కళాశాలలో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. నితిన్, శ్రీనివాస్‌రెడ్డి, సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏయూలో 'దక్ష 2కే–23' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో దక్ష 2కే–23 పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏయూ సీఈఓ నీలిమా మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ఫెస్ట్‌ను మార్చి 9, 10 తేదీల్లో ఏయూలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏయూ ఉప కులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా, డీన్ విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్సీ రాజును కలిసిన మున్నూరు కాపు సంఘం సభ్యులు

కీసర: ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శ్రీ రామలింగేశ్వర స్వామి మున్నూరు కాపు సంఘం కీసర మండల అధ్యక్షుడు చిందం మహేందర్ పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం మున్నూరు కాపులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఈ నెల 16 నుంచి 21 వరకు కీసరగుట్టలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విచ్చేయాలని కోరారు. ఈ నెల 16, 17, 19వ తేదీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ ఏడాది సుమారు 20 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు మహేందర్ తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సంఘం సభ్యులు ముత్తన్న పటేల్, వెంకటేశ్వర్లు, తోట నరేష్, కమలాకర్, చేవూరి సుధాకర్, నాయకపు శ్యామ్, నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

విద్యుత్ వైర్లు దొంగిలించిన ముగ్గురి అరెస్ట్

శామీర్‌పేట్: వెంచర్‌లో విద్యుత్ వైర్లు దొంగిలించిన ముగ్గురు దొంగలను శామీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామ పరిధిలోని ట్రీ టాప్ సైట్ వెంచర్‌లో గ్రామానికి చెందిన యువకుడు పతలావల్ రాంచంద్రనాయక్(20), కొమ్ముల నరేశ్(20)లు ఎలక్ట్రిషన్ ఉద్యోగులుగా పనిచేస్తుండగా ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన చెన్నా శేఖర్(27) వీరితో కలిసి పని చేసి మానేశాడు. డబ్బుల కోసం విద్యుత్ వైర్లు అమ్ముకుని సొమ్ము చేసుకుందామని భావించిన వీరు ఈ నెల 8న తూంకుంటలో కలుసుకుని దొంగతనం చేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 12న ముగ్గురు కలిసి ఉప్పర్‌పల్లిలో రాంచంద్రనాయక్, నరేశ్‌లు పనిచేస్తున్న ట్రీ టాప్ సైట్ వెంచర్‌లో రూ.8.5 లక్షల విలువ చేసే విద్యుత్ వైర్లను దొంగిలించి వాటిని శామీర్‌పేట్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న నర్సరీ వద్ద చెట్ల పొదల్లో దాచారు. దాచిన విద్యుత్ వైర్లను అమ్ముకునేందుకు మంగళవారం ముగ్గురు కలిసి బైక్‌పై వచ్చి విద్యుత్ వైర్లలోని ఒక సంచిని తీసుకుని తమ బైక్‌పై పెట్టుకుని తుర్కపల్లి వైపు వెళ్తుండగా పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు వారిని పట్టుకున్నారు. వారిని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకోవడంతో వారు దొంగిలించిన విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. నారపల్లి సప్తగిరి కాలనీకి చెందిన సూర్యనారాయణ రావు(70) ఘట్‌కేసర్‌లో తోటమాలిగా పనిచేస్తూ వారానికి ఒక రోజు ఇంటికి వెళ్లేవాడు. అతడు కొంత కాలంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాడు. కాగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉబ్బసం చికిత్స పొందుతూ మరణించాడని అతడి భార్యకు సమాచారమిచ్చారు. కాగా తన భర్త ఆరోగ్య సమస్యలతో పాటు గుండె పోటుతో మరణించాడని మృతుడి భార్య పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్య గొంతు కోసిన వ్యక్తికి మూడేళ్ల జైలు

మేడ్చల్‌రూరల్: భార్య గొంతు కోసి ఆమెను చంపేందుకు యత్నించిన వ్యక్తికి మేడ్చల్ కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధి సుభాష్‌నగర్‌లో నివాసం ఉండే లక్ష్మిసింగ్‌ను భర్త సూరజ్‌సింగ్ మద్యానికి బానిసై వేధింపులకు గురి చేశాడు. దీంతో లక్ష్మి సోదరుడు ఆమెను పైప్‌లైన్ రోడ్డులోని తన నివాసంలో ఉంచుకోగా లక్ష్మి కొంత కాలంగా సూరజ్‌సింగ్‌కు దూరంగా ఉంటుంది. దీంతో సూరజ్‌సింగ్ 2020 నవంబర్ 30న పనికి వెళ్లి వస్తున్న భార్య లక్ష్మిసింగ్‌పై పదునైన వస్తువుతో గొంతు కోశాడు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా మంగళవారం కేసు విచారణ జరిపిన మేడ్చల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రమేష్ నిందితుడు సూరజ్ సింగ్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

కండ్లకోయలో హాత్ సే హాత్ జోడో యాత్ర



హాత్ సే హాత్ జోడో యాత్రలో హరివర్ధన్‌రెడ్డి, నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు పోచయ్య, మున్సిపల్ అధ్యక్షుడు మల్లేశ్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాత్రలో టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పథంలో నడిపేందుకు తీసుకునే చర్యలను కరపత్రాల ద్వారా పంపిణీ చేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మేడ్చల్, తూంకుంట, దమ్మాయిగూడ పార్టీ నాయకులు రమణారెడ్డి, జైపాల్‌రెడ్డి, రామారావు, సర్పంచుల ఫోరం అధికార ప్రతినిధి సురేందర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'భూ బకాసురుడు మంత్రి మల్లారెడ్డి'



సమావేశంలో మాట్లాడుతున్న విక్రంరెడ్డి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి భూ కబ్జాలకు పాల్పడుతూ భూ బకాసురుడు అయ్యాడని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి విమర్శించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలోని హరిజనవాడలో మంగళవారం 'ప్రజాగోస–బీజేపీ భరోసా'ను నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రంరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడిచిన తొమ్మిదేళ్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పేదలకు మేలు చేకూర్చేందుకు దేశ వ్యాప్తంగా 'ఆయుష్మాన్ భారత' చేపడితే తెలంగాణ ప్రభుత్వం బీజేపీకి మంచి పేరు వస్తుందని రాష్ట్రంలో అమలుపర్చడం లేదన్నారు. మంత్రి మల్లారెడ్డి తన ప్రాంత ప్రజలకు సంక్షేమాన్ని మరిచి భూ కబ్జాలు, అసెంబ్లీలో ఒక జోకర్‌ల వ్యవహరించడం సిగ్గు చేటని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, కౌన్సిలర్ అమరం సరస్వతి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు మహేశ్, అభిలాష్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీ–హబ్‌ను సద్వినియోగం చేసుకోండి



టీ–హబ్ ఎంఓయూలో టీ–హబ్ సీఈఓ శ్రీనివాస్‌రావు

కీసర: 'ఆలోచనతో రండి–ఆవిష్కరణతో వెళ్లండి' అనే నినాదంతో స్టార్టప్‌లకు ఇంక్యూబెటర్‌గా తీర్చిదిద్దుతున్న టీ–హబ్ యువత కలల సాధనకు ఊతమిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీ–హబ్‌ను వినియోగించుకోవాలని టీ–హబ్ సీఈఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం భోగారం గ్రామంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలతో టీ–హబ్ ఎంఓయూ ఒప్పంద కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో హోలీమేరీ కళాశాల వైస్ చైర్మన్ సిద్ధార్థ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే ముదిరాజ్‌లకు పెద్దపీట



ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జవహర్‌నగర్: శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌ను మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ ముదిరాజ్ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే ముదిరాజ్‌లకు పెద్దపీట వేయడం జరుగుతోందని, ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షులు అనిల్ ముదిరాజ్, నాయకులు రొయ్యల కృష్ణయ్య ముదిరాజ్, భూమా పాల్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి



కార్నర్ మీటింగ్‌లో కొంపల్లి మోహన్‌రెడ్డి తదితరులు

కీసర: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నేత కొంపల్లి మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కీసరలో 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రజల తరపున ప్రభుత్వం, అధికారులతో పోరాటం చేయాలని బీజేపీ నేతలకు సూచించారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, భోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లాల తిరుమల్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పీర్జాదిగూడ శ్రీచైతన్య కళాశాల గుర్తింపును రద్దు చేయాలి'



నిరసన తెలుపుతున్న సంతోశ్, శివాజీ

ఘట్‌కేసర్: విద్యార్థుల ప్రాణాలు హరిస్తున్న పీర్జాదిగూడలోని శ్రీచైతన్య కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోశ్, ఎస్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు శివాజీ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ, ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కులు, ర్యాంకుల కోసం కళాశాల యాజమాన్యం ఒత్తిడి కారణంగానే రమాదేవి అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని, ఇది ముమ్మాటికి కళాశాల చేస్తున్న హత్యలేనని ఆరోపించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, శివ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకట్, రాములు, ప్రణయ్, అరవింద్, ప్రసాద్, వినోద్, నాగరాజు పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు యువత ముందుండాలి



రక్తదాన శిబిరం దృశ్యం

జవహర్‌నగర్: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ 26వ డివిజన్ కార్పొరేటర్ పానుగంటి బాబు అన్నారు. పుల్వామా దాడి ఘటనలో అమర జవాన్లను స్మరించుకుంటూ స్వేచ్ఛా వేదిక సొసైటీ డైరెక్టర్ రాజు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం చంద్రపురి కాలనీలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పానుగంటి బాబు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ కోఆర్డినేటర్లు బాలాజీ, చిరంజీవి, అశోక్, శ్రీకాంత్, చరణ్, అన్వర్, మస్తాన్, ఇస్మాయిల్, శరణ్, గణేష్, మెడికల్ ఆఫీసర్ వంశీ, స్థానికులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత రాష్ట్రమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం



కంటి వెలుగును ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ

మేడ్చల్‌రూరల్: తెలంగాణ రాష్ట్రాన్ని అంధత్వ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని గుండ్లపోచంపల్లి చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బీసీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రభుత్వం చేపడుతున్న రెండో విడత కంటి వెలుగును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, పెంటయ్య, హేమంత్‌రెడ్డి, బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.